క్లుప్తంగా

నిధుల మంజూరు చేయించిన మంత్రికి కృతజ్ఞతలు


మంత్రి ఉత్తమ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారామస్వామి గట్టు వద్ద లే అవుట్‌లో అసంపూర్తిగా ఉన్న 2,160 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సోమవారం రూ 74.80 కోట్లు మంజూరు చేయడం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గెల్లి రవి, యడ్ల విజయ్, ఎ శ్రీనివాస్ తదితర నాయకులు కలిసి కతజ్ఞతలు తెలిపారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్: పలు డిమాండ్లతో ఫిబ్రవరి 16న నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని టీఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో జరిగిన రైస్ మిల్లు డ్రైవర్ల గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో వెంకన్న, రామయ్య, వీరబాబు, రామారావు, జాని, గణేష్, పిచ్చయ్య రమేష్, మల్సూర్ పాల్గొన్నారు.

అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

నడిగూడెం: గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అడ్వైజరీ కార్యదర్శిగా నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న దొంగరి శ్రీనివాసరావును నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకచం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నడిగూడెంలో పిచ్చికుక్కల స్వైరవిహారం

నడిగూడెం: మండల కేంద్రంలో కొద్దిరోజులుగా పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సోమవారం ఎస్సీ, బీసీ కాలనీల్లో కుక్కలు దాడిలో ఐదుగురు గాయపడ్డారు. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి కుక్కలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

రాములు మృతి సీపీఎంకు తీరనిలోటు

గరిడేపల్లి: మండలంలోని వెలిదండ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు శ్రీలం రాములు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేరదమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం రాములు మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి ఎర్ర జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే.యాకూబ్, నాయకులు ఏనాల సోమయ్య, సుశీల, అంబటి భిక్షం, సత్యనారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఇటీవల మృతిచెందిన కారు డ్రైవర్ పి.శేఖర్ కుటుంబానికి ఓపెన్ ఐస్ సొసైటీ చేయూతనందించింది. పట్టణ పరిధిలోని సీతారాంనగర్‌లో నివసిస్తున్న శేఖర్ తల్లి నరసమ్మకు సోమవారం సొసైటీ సభ్యులు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చంద్రశేఖర్, శివ శంకర్, లక్ష్మణ్, సంపత్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు తొలగించాలి

హుజూర్‌నగర్: ప్రజలకు ఆధార్ ఇబ్బందులను తొలగించాలి సామాజిక కార్యకర్త మన్సూర్ అలీ కోరారు. సోమవారం హుజూర్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయం ఏఓ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలయాపన జరుగకుండా ప్రజలకు సత్వరమే ఆధార్ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సంకటహర చతుర్థి పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దాబాలలో మద్యం సిట్టింగ్‌లు!

- కోదాడ పరిధిలో యథేచ్ఛగా ఏర్పాటు
- బార్‌లను తలపించేలా నిర్వహణ
- పక్కపక్కన దాబాలతో తరచూ ఘర్షణలు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు అధికారులు


ఇరవై రోజుల క్రితం కోదాడలోని ఓ దాబా వద్ద ఘర్షణ పడుతున్న యువకులు

కోదాడ రూరల్: కోదాడ పరిధిలోని వివిధ రహదారుల వెంట ఏర్పాటు చేసిన దాబాలు బార్‌లను తలపిస్తున్నాయి. అనుమతి లేకున్నా మద్యం సిట్టింగ్‌లను యథేచ్ఛగా నడుపుతున్నారు. పట్టణ పరిధిలో విజయవాడ రోడ్డులోని ఓ కళాశాల సమీపంలో మొదట కేవలం పుల్కాల కోసం ఓ దాబాను ఏర్పాటు చేశారు. దాబా వ్యాపారం బాగుండడంతో అక్కడ పనిచేసిన వారు కొందరు హుజూర్‌నగర్ రోడ్డులో సొంతంగా మరో దాబాను ఏర్పాటు చేశారు. ఇక్కడ దాబా బాగా నడుస్తుండడంతో దాని పక్కనే ఇంకొకరు బాబా–2 పేరుతో మరొకటి పెట్టారు. దీంతో ఇద్దరి మధ్య వ్యాపార పోటీ పెరిగింది. అయితే దాబాలు ప్రారంభించిన మొదట్లో కేవలం ఫుడ్ మాత్రమే ఉండేది. ఆ తర్వాత స్థానిక నాయకులతో వారికున్న పరిచయాలతో మద్యం తాగేందుకు సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు.

అర్ధరాత్రి వరకు నిర్వహణ

మొదట్లో కేవలం పుల్కాల పేరుతో ప్రారంభించిన ఈ బాబాలలో ప్రస్తుతం అన్ని వసతులు కల్పిస్తూ బార్‌లను తలపించేలా నడుపుతున్నారు. ఈ దాబాల యజమానులు నిబంధనలను తుంగలోకి తొక్కి ఇష్టానుసారంగా అర్ధరాత్రి వరకు నడుపుతూ మద్య సిట్టింగ్‌లను కూడా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ఎక్సైజ్, పోలీసులు అధికారులు అటువైపు కన్నెత్తి చూడరంటే వారిని ఏ స్థాయిలో మేనేజ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇక రాజకీయంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉండే నాయకులను ప్రసన్నం చేసుకుంటున్న దాబాల యజమానులు తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

మద్యం మత్తులో గొడవలు

ఈ దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు కొనసాగుతుండడంతో మందుబాబుల మధ్య అనేక సార్లు ఘర్షణలు జరిగినా పోలీసులు మాత్రం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాది కిందట విజయవాడ రోడ్డులోని ఓ దాబాలో కోదాడ మండలం దొరకుంటకు చెందిన ఇరువర్గాల వారు ఘర్షణకు దిగడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆ పంచాయతీ స్టేషన్‌కు చేరిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 20 రోజుల క్రితం కూడా హుజూర్‌నగర్ రోడ్డులోని రెండు దాబాల నిర్వాహకుల మధ్య అర్ధరాత్రి 12 గంటల సమయంలో పెద్ద ఘర్షణ జరగడంతో ఒకరిపై ఒకరు కర్రలతో దాడులకు దిగారు. ఈ దాడుల్లో ఇద్దరికి తలలు కూడా పగిలాయి. ఈ సంఘటనపై ఇరువురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు అయ్యాయి. ఈ సంఘటన తర్వాత ఈ రెండు దాబాల్లో మద్యం తాగేందుకు నిర్వాహకులు అనుమతించడం లేదని తెలిసింది. కానీ, విజయవాడ రోడ్డులోని బాబాలో మాత్రం రాత్రింబవళ్లు తేడా లేకుండా మద్యం సిట్టింగ్‌లు నడుపుతూనే ఉన్నారు.

పలుసార్లు కేసులు నమోదు చేశాం



“దాబాల్లో మద్యం తాగేందుకు అనుమతి లేదు. పట్టణంలో పలు దాబాల్లో మద్యం తాగుతున్న వారితో పాటు యజమానులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటున్నాం. కేసులు కూడా నమోదు చేశాం. మద్యం తాగుతున్నట్లు సమాచారం ఇస్తే ఆయా దాబాలపై చర్యలు తీసుకుంటాం.

– రాము, కోదాడ పట్టణ సీఐ

ఘనంగా బొడ్రాయి పండుగ


హోమంలో పాల్గొన్న అర్చకులు, గ్రామస్తులు

మఠంపల్లి: మండలంలోని చెన్నాయిపాలెంలో బొడ్రాయి, గ్రామదేవతల ఆలయాల వార్షికోత్సవాన్ని సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అర్చకులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనులు, మహిళలు.. నంగారాభేరీలు, డప్పు చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపు బోనాలు తీసుకెళ్లి గ్రామ దేవతల ఆలయాలు, బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా కోళ్లు మేకపోతులు, గొర్రెపొట్టేళ్లను బలిఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యామంజీనాయక్, వర్కింగ్‌ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, మాజీ జెట్పీటీసీలు నీలామంజీనాయక్, భూక్యాఅనసూర్య, సర్పంచ్ నాగునాయక్, మాజీ సర్పంచ్ భూక్యానాగు, గోవర్ధన్‌నాయక్, పున్నానాయక్, తులిశానాయక్, రవీందర్‌నాయక్, నాగార్జుననాయక్, రాహుల్, జవహర్‌లాల్, మాళోతు నాగు, హనుమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ఆరీఫ్

నేరేడుచర్ల: రక్తహీనతకు చెక్ పెట్టేందుకు రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో సోమవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనీమియా ముక్తాభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత కలిగిన విద్యార్థులకు ఫోలిక్‌యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కె ఆరీఫ్ మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థుల్లో రక్తవృద్ధి కోసం ఆకు కూరలు, గుడ్లు, పాలు వంటివి ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, వైద్య సిబ్బంది నాగరాజు, రేణుక, నర్సయ్య, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు నర్స కుమారీ, సైదులు, పద్మావతి, రషీద్, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, రవి, కృష్ణప్రసాద్, కల్పన, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు,. లాల్‌సహాయబ్, విజయలక్ష్మి, సరస్వతి, ఆశా వర్కర్లు గురువమ్మ, సునీత పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


నేరేడుచర్ల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేరేడుచర్ల :నేరేడుచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో, మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూముల్లో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవెల్లి అరుణ్‌మాదిగ, పట్టణ అధ్యక్షుడు ఇంజమూరి పున్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేరేడుచర్లలో తహసీల్దార్ సురిగి సైదులు వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సొంత ఇళ్లు లేక అద్దె రూమ్‌లో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాబురావు, సాయి, శ్రీను, వెంకటేశ్వర్లు, నగేష్, గోపాల్, రవి, ఉపేంద్ర, సైదులు, నవీన్, కార్తీక్, వెంకట్, కరుణాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమప్ప దేవాలయం కమిటీ చైర్మన్ రాజీనామా

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం బురుగులతండాలోని సోమప్ప దేవాలయ కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను దేవాదాయ, ధర్మదాయ శాఖ ఈఓ. మృత్యుంజశాస్త్రీకి పంపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మూడేళ్లుగా కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.40 లక్షల వ్యయంతో దేవాలయ అభివృద్ధికి వివిధ పనులను చేపట్టినట్లు తెలిపారు. తమ పాలకవర్గానికి ఇంత కాలం సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు వెంట వ్యర్థాలు పారబోస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


మొక్కలు కాలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి సైదులు

హుజూర్‌నగర్: రోడ్డు వెంట వ్యర్థాలు పారబోసినా, కాల్చిన వారిపై చర్యలు తప్పవని దొండపాడు పంచాయతీ కార్యదర్శి సైదులు హెచ్చరించారు. చింతలపాలెం మండలం దొండపాడు తదితర గ్రామాల రోడ్డు పక్కన ప్లాస్టిక్, చెత్త వ్యర్థాలను పోసి కాల్చడంపై ×యథేచ్ఛగా వ్యర్థాల పారబోత≘ అనే శీర్షికతో సాక్షి దిన పత్రికలలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఎంపీడీఓ జగదీష్ ఆదేశాల మేరకు కార్యదర్శి సైదులు హరితహారం చెట్లు కాలిన స్థలానికి వెళ్లి పరిశీలించి దానిపై నీళ్లు పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటువంటి విషయాలపై ప్రజలకు సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం మధు

నేరేడుచర్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర ఆంగ్లభాషా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో దిర్శించర్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు స్పెల్ విజార్డ్ విభాగంలో దామరచర్ల ప్రణవీ, డ్రామా విభాగంలో పెంచికల్‌దిన్న జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎస్.మానస ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల భాషా ఉపాధ్యాయులు రషీద్, శ్రీనివాస్‌రావు, నర్సింహారావు, కళ్యాణి, శ్యామ్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్నూకర్ పోటీలు


విజేతలతో క్రీడల నిర్వాహకులు

కోదాడ: మూడు రోజులుగా కోదాడలోని మదార్ స్నూకర్ పాయింట్‌లో నిర్వహిస్తున్న కోదాడ నియోజకవర్గ స్థాయి స్నూకర్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వెంకట్, నజీర్ మీర్జా, కిరణ్ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా నిర్వాకులు ఎస్‌కే.ఫిరోజ్, సైదులు, విద్యాసాగర్, కంచుకొమ్ముల శంకర్ పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర, సహస్రనామార్చనలు, సహస్ర కుంమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణం జరిపి భక్తులను తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ వీస్‌కుమార్, అర్చకులు ఫణికుమార్ చార్యులు, తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఫాదర్ మార్టిన్

మఠంపల్లి: మఠంపల్లిలోని కానుక మాత చర్చి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో చేపట్టిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శుభవార్త చర్చి ఫాదర్ మార్టిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహ పూర్వక వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలకృష్ణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దైద రాయల్, నిర్వాహకులు కొత్తపల్లి శౌరి, వస్కుల జయరాజు, అరాల నాగరాజు, పొట్టబాబు, మట్టయ్య, జోజి, వీరాస్వామి, అంజి, సుధాకర్, ఇమ్మానియేల్, సందీప్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో వైద్యశిబిరం

చిలుకూరు: మండలంలోని నారాయణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నవ్య మాట్లాడుతూ కాలనీలోని ప్రబలిన జ్వరాలను నియంత్రించడం కోసమే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సారిక, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పాల్గొన్న పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది

విలువలతో కూడిన విద్యనందించాలి


భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు, ఇస్కాన్ సభ్యులు

హుజూర్‌నగర్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని ఇస్కాన్ సంస్థ సభ్యులు కోరారు. హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీత–విలువలు అనే పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థి దశలో తెలుసుకున్న పలు విషయాలు జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయవాణి దేవి, సంస్థ సభ్యులు కోటేశ్వరరావు, మురళి, శ్రీదేవి హైమావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


తమ్మిశెట్టి శృతి

నేరేడుచర్ల: ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో జరిగే జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు నేరేడుచర్లకు చెందిన క్రీడాకారిని తమ్మిశెట్టి శృతి ఎంపికయ్యారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌లోని నూకరాజు–నాగమణి దంపతుల కుమార్తె అయిన శృతి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆంధ్ర మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ఎర్రవరం వాసికి డాక్టరేట్


తమిళనాడు గవర్నర్ చేతులమీదుగా డాక్టరేట్ పట్టా అందుకుంటున్న హసన్‌జానీ

కోదాడ రూరల్: మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన ఎస్‌కే.హసన్‌జానీ తమిళనాడులోని కరైకుడి అలగప్ప యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఆ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ×ఎఫెక్ట్ ఆఫ్ ఎరోబిక్ సర్క్యూట్ ట్రెనింగ్ అండ్ సస్పెన్షన్ ట్రెనింగ్ సెలెక్టెడ్ పర్ఫామెన్స్ పారామీటర్ ఆఫ్‌ది సీనియర్ అథ్లెట్≘ అనే అంశంపై ప్రొఫెసర్ వైరవసుందర్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు గానూ సోమవారం అక్కడ జరిగిన కాన్వకేషన్‌లో తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ఆ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్‌ఎఎస్ రాజకన్నప్పన్ చేతుల మీదగా డాక్టరేట్ పట్టాను తీసుకున్నాడు. ఈ సందర్భంగా హసన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

సీఈఓపై చర్యలు తీసుకోవాలి

మేళ్లచెరువు: మేళ్లచెరువు పీఏసీఎస్ సీఈఓ గుమ్మిత వెంకటరెడ్డి అవినీతి పాల్పడుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార సంఘం అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తనకు నచ్చిన వారికి ఎటువంటి హామీలు లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు.

జైభీమ్ ఫౌండేషన్ ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మేళ్లచెరువు: మండలంలోని కందిబండ గ్రామానికి చెందిన పులి రాజు అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా అతనికి జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డెక్కెం గోపయ్య సోమవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంద రవి, నాగేశ్వరరావు, వీరయ్య, రాములు, ధనమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్ వెంకట్రావుకు ఫిర్యాదు చేస్తున్న డైరెక్టర్లు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతి, అక్రమాల విషయంలో చైర్మన్, సీఈఓలపై సమగ్ర విచారణ జరిపించాలని సంఘం డైరెక్టర్లు కోరారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేటలో జిల్లా కలెక్టర్ వెంకట్రావును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఇతర ప్రాంత రైతుల పేరుతో బిల్లులు తయారు చేసి ఐకేపీ ధాన్యం అమ్మినట్లు ఆ బిల్లులను చైర్మన్ అతడి బంధువుల ఖాతాలోకి మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు లక్షా 25 వేల బస్తాల ధాన్యం కొనుగోలులో గోల్‌మాల్ జరిగిందన్నారు. ఈ విషయంపై తాము గతంలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో డైరెక్టర్లు రమణారెడ్డి, హేమలత, రంగారెడ్డి, ముత్తమ్మ, వెంకయ్య, వల్లభరెడ్డి, సైదులు, శ్రీను, గంగరాజు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలకు పక్కా భవనాలేవీ?

- నడిగూడెం మండలంలో 34 కేంద్రాలు
- ఐదు సెంటర్లకే సొంత భవనాలు
- ఆరు కేంద్రాలు అద్దె ఇళ్లలో..
- మిగతావన్నీ పాఠశాలల్లో నిర్వహణ
- అంతటా మౌలిక వసతుల్లేక ఇబ్బందులు


నడిగూడెంలోని ఎస్సీ కాలనీలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం


నడిగూడెం ప్రాథమిక పాఠశాల వరండాలో చిన్నారులను కూర్చొబెట్టిన అంగన్‌వాడీ సిబ్బంది

నడిగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు కరువయ్యాయి. ఫలితంగా ఆయా కేంద్రాలను నడుపుతున్న టీచర్లు, ఆయాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీల్లో 34 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 1,241 మంది లబ్ధిదారులు పౌష్టికాహారం పొందుతున్నారు. వీటిల్లో వల్లాపురం, చెన్నకేశ్వాపురం, రత్నవరం, బృందావనపురం, కరివిరాల ఐదు గ్రామాల్లోని కేంద్రాలకే పక్కా భవనాలు ఉన్నాయి. ఇంకా 29 కేంద్రాల్లో ఆరు అద్దె భవనాల్లో, మిగతా 23 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడా మౌలిక వసతులు లేవు. వీటికితోడు 32 కేంద్రాలకు టీచర్లు ఉండగా, వల్లాపురం, రత్నవరం గ్రామాల్లో రెండు కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే నడిగూడెం, తెల్లబల్లి రెండు కేంద్రాల్లో రెండు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో వాటి నిర్వహణ కూడా కష్టంగా మారింది.

శిథిల భవనాల్లో నిర్వహణ

మండల కేంద్రంతోపాటు, పలు గ్రామాల్లోఅద్దె భవనాలు, ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు శిథిల భవనాల్లో నడుస్తున్నాయి. ఆయా భవనాల్లో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోని అంగన్‌వాడీలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పక్కా భవనాలు లేని వాటికి కొత్త భవనాలను నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వివరాలు ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు	34
0–సంవత్సరం చిన్నారులు	87
మూడేళ్లలోపు వారు	458
ఐదేళ్లలోపు వారు	438
గర్భిణులు	120
బాలింతలు	138

నిర్వహణ కష్టంగా ఉంది



“పాతకాలం నాటి అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. ఎస్సీ, బీసీ కాలనీలకు చెందిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకుంటున్నారు. పక్కా భవనం లేకపోవడంతో నిర్వహణ కష్టంగా మారింది.

– కొండలమ్మ, అంగన్‌వాడీ టీచర్, నడిగూడెం

ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాం..

“మండలంలో 29 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. కొన్ని సెంటర్లలో టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇబ్బందికరంగా మారింది. అంగన్‌వాడీల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులతో పాటు, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– రజిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్